# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు

సంపుటి : 01 | సంచిక : 272 | వరంగల్ | శనివారం, 01 ఆగస్టు 2026 | పేజీలు : 02



WANTED విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745





# గిరిజన సూరీడు.. కాశీరాం..

## ▪ ఆకలిని జయించి.. ఉన్నత శిఖరాన్ని తాకి..

## ▪ స్వయం కృషితో సీఐ వరకు ఎదిగిన గూడూరు గిరిజన బిడ్డ..

**పొట్ట చేతపట్టుకుని కూలీ పనులకు వెళ్లిన చేతులే.. నేడు నేరస్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ఖాళీ కడుపుతో పుస్తకాలు పట్టిన ఆ చేతులే.. నేడు పోలీస్ ఖాకీ డ్రెస్సులో సమాజానికి రక్షణగా నిలుస్తున్నాయి. పేదరికం, ఆకలి, అవమానాలు ఎదురైనా తలవంచక.. ఆత్మవిశ్వాసం, పట్టుదలే ఆయుధాలుగా స్వయంకృషితో ఎదిగిన గిరిజన బిడ్డ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కాశీరాం ప్రస్థానం నేటి యువతకు ఒక నిలువెత్తు ఆదర్శం.**

*- ధరావత్ శ్రీనునాయక్, పాలకుర్తి వాణి*



హనుమకొండలో ఖాళీ కడుపుతో కూలీ పని చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించి పీహెచ్ డీ పూర్తి చేసిన మహబూబాబాద్ జిల్లా గూడూరు గిరిజన తండాకు చెందిన కాశీరాం. నేడు తెలంగాణ పోలీస్ శాఖలో సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా సేవలందిస్తూ తనదైన ముద్ర వేస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలో విధులు నిర్వహిస్తూ పోలీసు సిబ్బందికి ఆధునిక శిక్షణ, మానసిక ధైర్యం, క్రమశిక్షణను పెంపొందించే నాయకుడిగా గుర్తింపు పొందారు. నేరస్థులకు కఠిన అధికారిగా, ప్రజలకు ఆపన్నహస్తంగా, గిరిజన యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న కాశీరాం ప్రస్థానం నేటి యువతకు ఆదర్శంగా మారింది.

### పోలీసు అధికారిగా విజయ ప్రస్థానం

తెలంగాణ పోలీస్ శాఖలో ఎంతోమంది అధికారులు తమదైన శైలిలో సేవలందిస్తుంటారు. కానీ కొందరు మాత్రమే విధి నిర్వహణతో పాటు, తోటి సిబ్బందిని తీర్చిదిద్దడంలో, వారిని వృత్తిపరంగా అత్యున్నత స్థాయికి చేర్చడంలో ప్రత్యేక ముద్ర వేస్తారు. అలాంటి వారిలో ఒకరు భూపాలపల్లి జిల్లాలో సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న పేదరికం అడ్డంకి కాదని, పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని తన జీవితంతో నిరూపించిన పోలీసు అధికారి ఆయైన. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని ఓ మారుమూల గిరిజన తండాలో జన్మించిన బంజారా బిడ్డ, జీవితంలో ఎన్నో ఓటమికి తలవంచకుండా, అవకాశాల కోసం ఎదురుచూడకుండా స్వయంకృషితో ఉన్నత శిఖరాలను అధిరోహించిన కాశీరాం జీవితం నేటి యువతకు ఆదర్శం. గూడూరు గిరిజన తండా నుంచి ప్రారంభమైన ఆయన ప్రయాణం నేడు తెలంగాణ పోలీస్ శాఖలో సేవ, క్రమశిక్షణ, నాయకత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. ఆయన ప్రస్థానం పోలీసు సిబ్బందికే కాకుండా సమాజంలోని ప్రతి యువకుడికి స్ఫూర్తినిచ్చే విజయగాథగా నిలిచింది.

మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండలానికి చెందిన ఒక సాధారణ బంజారా కుటుంబంలో కాశిరాం జన్మించారు. ఎటువంటి ఆర్భాటాలు లేని సాధారణ నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ.. చిన్నతనం నుంచే పట్టుదల, క్రమశిక్షణను అలవర్చుకున్నారు. సమాజానికి సేవ దేయాలనే బలమైన సంకల్పంతో పోలీస్ శాఖలోకి అడుగుపెట్టారు. సొంత కష్టాన్ని నమ్ముకుని, అంకితభావంతో పనిచేస్తూ సబ్ఇన్స్ క్టర్ (SI) నుండి సర్కిల్ ఇన్ స్పెక్టర్ (CI) స్థాయికి ఎదిగారు. గిరిజన తండాల నుంచి వచ్చే యువతకు ఆయన నిలువెత్తు నిదర్శనంగా, ఒక రోల్ మోడల్ గా నిలిచారు.

### విధి నిర్వహణలో ఆత్మవిశ్వాసం

డ్యూటీల ఒత్తిడిలో ఉండే కానిస్టేబుళ్లు, ఇతర హోంగార్డుల మానసిక స్థైర్యాన్ని పెంచేలా కౌన్సిలింగ్, మోటివేషనల్ సెషన్స్ నిర్వహిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో శారీరక దారుఢ్యం ఎంత ముఖ్యమో స్వయంగా ఆచరించి చూపిస్తూ, సిబ్బంది చేత రెగ్యులర్ వ్యాయామం, పరేడ్స్ చేయిస్తు న్నారు. "ఒక మంచి లీడర్ అంటే కేవలం ఆదేశాలు ఇచ్చే వాడు కాదు... తన టీను తనతో పాటు నడిపించేవాడు. ఈ సూత్రాన్ని సీఐ కాశిరాం అక్షరాలా పాటిస్తూ భూపాలపల్లి పోలీస్ శాఖలో ప్రత్యేక ప్రశంసలు అందుకుంటున్నారు. గూడూరు మట్టిలో పుట్టిన ఈ బంజారా బిడ్డ, భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ కీర్తి కిరీటంలో ఒక వెలుగుతున్న వేఖంగా నిలిచా రనడంలో ఎలాంటి సందేహం లేదు.



# ఆరుతడి పంటలు సాగు చేయాలి

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**పాలకుర్తి వాణి, బచ్చన్నపేట** : ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. శుక్రవారం జిల్లాలోని బచ్చన్నపేట మండలం ఎద్దుగూడెం గ్రామంలో పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. గ్రామంలో సాగు పరిస్థితులు, పంటల విస్తీర్ణం, దిగుబడులు, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై రైతులతో సుదీర్ఘంగా చర్చించారు. గతంలో వరి సాగు చేసినప్పుడు వచ్చిన ఆదాయం, ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటల ద్వారా పొందుతున్న లాభాలపై రైతుతో చర్చించారు. రైతుల అనుభవాలను ఇతర రైతులకు తెలియజేసి, వరి సాగుకు బదులుగా పెసర, నువ్వులు, కందులు, మిర్చి, బెండ, వాక్కాయలు వంటి ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. నీటి వినియోగం తక్కువగా ఉండే ఈ పంటలు ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులకు అనుకూలమని పేర్కొన్నారు. గ్రామంలో సమీకృత వ్యవసాయ (Integrated Farming) విధానాన్ని అనుసరిస్తున్న రైతు పరమేశ్వర్ వ్యవసాయ క్షేత్రాన్ని కూడా కలెక్టర్ సందర్శించారు. డ్రమ్ సీడింగ్ పద్ధతిలో సాగు, వివిధ పంటల సమీకృత సాగు, ఆదాయ వనరుల వైవిధ్యీకరణ వంటి అంశాలను పర్యవేక్షించి, అభినందించారు. వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీలతో కలెక్టర్ మాట్లాడి, వారి ఉపాధి పరిస్థితులు, కూలీ వివరాలు తెలుసుకున్నారు. ఆరుతడి పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయాన్ని కాపాడటంతో పాటు వ్యవసాయాన్ని స్థిరంగా కొనసాగించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఓ అంబికా సోనీ, వ్యవసాయ శాఖ అధికారులు శరత్ చంద్ర , సర్పంచ్ నర్సింగ రావు , రైతులు పాల్గొన్నారు.






Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341